సాక్షి సూర్యాపేట

గురువారం । 5 । అక్టోబర్ । 2023



అధికారంలోకి రాగానే..

కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీ స్కీములు అమలు చేస్తామని ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. - IIలో



సఖ్యతకు అడ్డొస్తున్నాడనే..

సఖ్యతకు అడ్డొస్తున్నాడని ఓ మహిళ తన భర్తను హత్య చేయించినట్లు పోలీసుల విచారణలో తేలింది. - IIలో



వైభవంగా నిత్య కల్యాణం

మట్టపల్లి క్షేత్రంలో బుధవారం లక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. - IIలో

న్యూస్‌రీల్

ఆయిల్ పామ్ సాగుపై నేటి నుంచి సదస్సులు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించేందుకు వారం రోజుల పాటు రైతు వేదికల్లో అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావు బుధవారం ఒక ప్రకటన తెలిపారు. జిల్లాలోని 82 రైతులు వేదికల్లో గురువారం నుంచి 11వ తేదీ వరకు వారం రోజులను ఆయిల్ పామ్ వారంగా ప్రకటించి స్పెషల్ డ్రైవ్ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో 2023–24 సంవత్సరానికి ఆయిల్ పామ్ సాగు లక్ష్యం 10,500 ఎకరాలు కాగా ఇప్పటివరకు 1,410 ఎకరాల్లో ప్లాంటేషన్ పూర్తయిందని, మిగిలిన 9,100 ఎకరాల్లో సాగు చేసే విధంగా ప్రతి ఏఈఓ కృషి చేయాలని సూచించారు. అంతర పంటలుగా పాడి పశువులు, గొర్రెలు, మేకలు, నాటు కోళ్ల పెంపకం ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చని రైతులందరికీ తెలపాలని పేర్కొన్నారు. ఎకరం సాగుకు మొక్కలపై, బిందు సేద్యంపై, అంతర పంటల సాగుకు ఎరువుల యాజమాన్యానికి రూ.50వేల రాయితీ కల్పించనున్నామని తెలిపారు.

అక్రమాలపై విచారణ జరపాలి



కలెక్టరేట్ ఏఓకు వినతిపత్రం అందిస్తున్న టీజేఎస్ నాయకులు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): గృహలక్ష్మి, డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో అధికార పార్టీ నాయకులు పాల్పడిన అక్రమాలపై విచారణ జరపాలని తెలంగాణ జన సమితి (టీజేఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మార్జున్ డిమాండ్ చేశారు. అర్హులైన పేదలందరికీ గృహలక్ష్మి పథకం వర్తింపజేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం సూర్యాపేట కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఏఓ సుదర్శన్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన పేదలకు డబుల్ ఇళ్లు, గృహలక్ష్మి వర్తింజేయకుండా అధికార పార్టీ నాయకులు తమ అనుచరవర్గానికే కేటాయించారని ఆరోపించారు. జిల్లాలో డబుల్ బెడ్ రూం ఎంపిక పారదర్శకంగా జరగలేదన్నారు. సూర్యాపేట కలెక్టరేట్‌లో డ్రా తీసే సమయంలో స్టేజి మీద ఆయా వార్డుల కౌన్సిలర్లను అధికారులు అనుమతించడంతో ఎంపిక పక్షపాతం చేశారన్నారు. కలెక్టర్ ఆధ్వర్యంలో తిరిగి డ్రా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జనసమితి రాష్ట్ర కమిటీ సభ్యుడు గట్ల రమాశంకర్, పట్టణ పార్టీ అధ్యక్షుడు బంధన్ నాయక్, ఎస్సీసెల్ జిల్లా కన్వీనర్ అడ్వకేట్ బచ్చలకూరి గోపి, మైనార్టీ సెల్ జిల్లా కన్వీనర్ రఫీ తదితరుల పాల్గొన్నారు.

బీజేపీ తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న పిట్టల రవి

దురాజ్‌పల్లి (సూర్యాపేట): కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం సోషల్ మీడియాలో కమ్యూనిస్టులు, అభ్యుదయ వాదులపై చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలని సీపీఎం రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ పిట్టల రవి పిలుపునిచ్చారు. బుధవారం సూర్యాపేటలోని ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సీపీఎం సోషల్ మీడియా జిల్లా కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తప్పుడు భావజాలాన్ని, కల్పిత కథలను ప్రచారం చేస్తూ ప్రజల మధ్య ఐక్యతను దెబ్బతీస్తోందన్నారు. సోషల్ మీడియా జిల్లా కో కన్వీనర్ మట్టపెల్లి సైదులు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ జె.నరసింహారావు, జిల్లా కోకన్వీనర్లు కోట గోపి, ధనియాకుల శ్రీకాంత్, వీరబోయిన రవి, వేల్పుల వెంకన్న, మడ్డి అంజిబాబు, చిన్నపంగి నర్సయ్య పాల్గొన్నారు.

అనుమతి లేకుండా వైద్యం చేస్తే చర్యలు

కోదాడ: ఆర్‌ఎంపీలు అనుమతులు లేకుండా వైద్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్యాధికారి హర్షవర్ధన్ హెచ్చరించారు. బుధవారం కోదాడలోని వివిధ ప్రైవేట్ వైద్యశాలలను ఆయన తనిఖీ చేశారు. హుజూర్‌నగర్ రోడ్డులో ఉన్న ఓ వైద్యశాలలో ఒక వైద్యుడి స్థానంలో మరొకరు వైద్యం చేస్తుండడాన్ని గుర్తించి వారికి నోటీసు జారీ చేస్తామని తెలిపారు. పట్టణంలో ఇద్దరు ఆర్‌ఎంపీలు అనుమతులు లేకుండా క్లినిక్‌లు నిర్వహిస్తున్నారని, వారికి కూడా నోటీసులు జారీ చేస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

కొత్త ఓటర్లు 29,940 మంది



- తుది జాబితా ప్రకటించిన అధికారులు
- జిల్లా ఓటర్లు మొత్తం 9,64,346 మంది

దురాజ్‌పల్లి (సూర్యాపేట): జిల్లాలో 29,940 మంది కొత్త ఓటర్లు పెరిగారు. ఆగస్టులో ఓటరు ముసాయిదా జాబితా ప్రకటించిన అనంతరం మార్పులు, చేర్పులు, కొత్త ఓటర్ల నమోదుకు అవకాశం కల్పించారు. అనంతరం అభ్యంతరాలు స్వీకరించిన అధికారులు రెండు నెలల తర్వాత బుధవారం తుది జాబితాను విడుదల చేశారు. ఈ జాబితా ప్రకారం 9,64,346 మంది ఓటర్లు నమోదైనట్టు తేలింది. తుది జాబితా ప్రకారం 4,75,915 మంది పురుష ఓటర్లు, 4,88,374 మంది మహిళలు, 57 మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారు. వీరంతా రానున్న శాసనసభ ఎన్నికల్లో తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారు.

తుంగతుర్తిలో అత్యధికంగా..

జిల్లాలోని నాలుగు నియోజక వర్గాల పరిధిలో 9,64,346 మంది ఓటర్లు ఉండగా అత్యధికంగా తుంగతుర్తి నియోజకర్గంలో 2,48,710 మంది ఉన్నారు. అత్యల్పంగా సూర్యాపేట నియోజకవర్గంలో 2,35,341 మంది ఓటర్లు ఉన్నారు. అలాగే, కోదాడ నియోజకవర్గంలో 2,37,437 మంది, హుజూర్‌నగర్ నియోజకవర్గంలో 2,42,858 మంది ఓటర్లు ఉన్నారు. హుజుర్‌నగర్, కోదాడ, సూర్యాపేట నియోజకవర్గాలలో మహిళా ఓటర్లు అధికంగా ఉండగా, తుంగతుర్తిలో పురుష ఓటర్లు అధికంగా ఉన్నారు. కాగా గత ఆగస్టులో ప్రకటించిన ఓటర్ల జాబితా ప్రకారం జిల్లాలో 9,34,406 మంది ఓటర్లు ఉండుగా తాజా జాబితాలో 9,64,346 మంది ఓటర్లు నమోదయ్యారు.

మున్సిపల్ కమిషనర్‌తో నేడు ఫోన్‌ఇన్

తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని పారిశుద్ధ్య సమస్యలపై గురువారం సాక్షి దినపత్రిక ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహించనుంది. మురుగు కాల్వల నిర్మాణం, ఓపెన్ డ్రెయినేజీలు, చెత్త పేరుకపోవడం, ఓపెన్ ప్లాట్లలో మురుగు నీరు నిల్వ ఉండటం తదితర సమస్యలపై మున్సిపాలిటీ ప్రజలు కమిషనర్‌కు ఫోన్ చేసి తెలియజేయవచ్చు. ఈ ప్రశ్నలకు కమిషనర్ సమాధానం ఇస్తారు.

తేదీ : 05-10-2023 (గురువారం)

ఉదయం 10:30 నుంచి 11:30 గంటల వరకు

ఫోన్ చేయాల్సిన నంబర్ : 99485 40696



దండు శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ తిరుమలగిరి

నిలిచిన ఈ-సేవలు..!



సూర్యాపేటలో కలెక్టరేట్ ఎదుట సమ్మె చేస్తున్న ఈ-పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లు

సమ్మె బాటలో ఈ-పంచాయతీ సిబ్బంది

- ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్
- ఆరో రోజుకు చేరిన ఆందోళనలు
- సేవలందక ఇబ్బందుల్లో గ్రామీణ ప్రజలు

నాగారం: తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈ-పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లు సమ్మె బాట పట్టారు. సెప్టెంబర్ 29వ తేదీ నుంచి జిల్లాలోని కలెక్టరేట్ ఎదుట సమ్మె చేస్తున్నారు. వీరి సమ్మె బుధవారం నాటికి ఆరో రోజుకు చేరుకుంది. సమ్మె కారణంగా గ్రామ పంచాయతీల్లో ఈ-సేవలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఫలితంగా గ్రామీణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

సేవల్లో వేగం పెంచేందుకే..

పాలనలో పారదర్శకత, జవాబుదారీతనంతో పాటు సేవల్లో వేగాన్ని పెంచాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ-పంచాయతీలను మంజూరు చేసింది. ఇందులో సేవలందించేందుకు కంప్యూటర్ ఆపరేటర్లను నియమించింది. అయితే వారికి వేతనాలు గ్రామపంచాయతీలే చెల్లించాలని నిర్ణయించడంతో వచ్చే ఆదాయం కుటుంబ పోషణకు సరిపోక నానా అవస్థలు పడుతున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రభుత్వం వారి మొర ఆలకిస్తుందన్న నమ్మకంతో ఉద్యోగులు తమ డిమాండ్లతో సమ్మె బాటపట్టారు.

63 మంది ఆపరేటర్లు

ఇంటర్నెట్ ఆధారంగా గ్రామ పంచాయతీల్లో ప్రజలకు అందిస్తున్న అన్ని రకాల సేవలను కంప్యూటరీకరించేందుకు ప్రభుత్వం ఈ-పంచాయతీ కార్యక్రమాన్ని 2014–15లో ప్రారంభించింది. ఇందులో భాగంగా ముందుగా జిల్లా పంచాయతీ కార్యాలయంలో జిల్లా ప్రాజెక్టు మేనేజర్(డీపీఎం)లను, తర్వాత గ్రామాల్లో క్లస్టర్ల వారీగా కంప్యూటర్ ఆపరేటర్లను నియమించింది. ఔట్ సోర్సింగ్ పద్ధతిలో కార్వీ సంస్థ ద్వారా వీరిగా కంప్యూటర్ ఆపరేటర్లనను నియామకాలు జరిగాయి. ఆపరేటర్లందరికీ 14వ ఆర్థిక సంఘం నిధుల నుంచి పరిపాలన నిధుల కింద 10శాతం కేటాయించింది. నెలకు రూ.8వేలకు తగ్గకుండా వేతనాలు చెల్లించాలని ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం జిల్లాలో ఒక డీపీఎంతో పాటు ఈ-పంచాయతీ, ఆర్‌జేసీ ఆపరేటర్లు 63 మంది పని చేస్తున్నారు. జిల్లాలో ఒక్కో ఆపరేటర్ 8 నుంచి 10 గ్రామ పంచాయతీల్లో చేస్తున్నారు. గ్రామాల్లో అమలవుతున్న ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాలన్నింటినీ ఆన్‌లైన్‌లో నమోదు చేస్తూ అనుసంధానకర్తలుగా వీరు ప్రధాన భూమిక పోషిస్తున్నారు. అలాంటి తమకు వెంటనే ఉద్యోగ భద్రత కల్పించాలని ఈ-పంచాయతీ సిబ్బంది కోరుతున్నారు.

ప్రధాన డిమాండ్లు ఇవే..

జిల్లా స్థాయిలో పనిచేసే డీపీఎంలకు పే స్కేల్ అమలు చేయాలి. గ్రామాల్లో పని చేసే ఈ-పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లకు జూనియర్ అసిస్టెంట్ హోదా కల్పించి వేతనం చెల్లించాలి. మహిళ ఉద్యోగులకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ఇవ్వాలి. ఉద్యోగ సిబ్బందికి ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలి. ఉద్యోగి మృతి చెందితే కుటుంబంలో ఒకరికి కారుణ్య నియామకం కింద ఉద్యోగం కల్పించాలి. ఉద్యోగ భద్రత కల్పించి వేతనాలు పెంచాలి.

అరకొర వేతనాలతో ఇబ్బందులు



అరకొర వేతనాలతో ఇబ్బందులు పడుతున్నాం. ప్రస్తుతం ఇస్తున్న వేతనాలు కుటుంబ పోషణకు చాలడం లేదు. నానాటికీ పెరిగిపోతున్న నిత్యావసరాల ధరలతో దుర్భర జీవితాలు గడుపుతున్నాం. 2014 నుంచి పనిచేస్తున్నా.. మా ఉద్యోగాలకు భద్రత లేకుండా పోయింది. వేతనాలు పెంచి, ఉద్యోగ భద్రత కల్పించాలి.

– భిక్షం, ఈ-పంచాయతీ ఆపరేటర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు, సూర్యాపేట

ఏళ్ల తరబడి పనిచేస్తున్నా..



పంచాయతీల్లో అన్ని కార్యక్రమాల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నాం. ఈ విభాగంలో కీలకంగా సేవలు అందిస్తున్న ఆపరేటర్ల సమస్యలను మాత్రం ఎవరూ పట్టించుకోవడం లేదు. ఏళ్ల తరబడి పనిచేస్తున్న ఎలాంటి గుర్తింపు లేదు. ప్రభుత్వం స్పందించి మమ్మల్ని రెగ్యులరైజ్ చేసి ఆదుకోవాలి.

– చింతల సురేష్, ఈ-పంచాయతీ ఆపరేటర్ల నియోజకవర్గ అధ్యక్షుడు

పేదలకు మెరుగైన వైద్యమే లక్ష్యం



కాసరబాదలో పల్లె దవాఖానాలో సమావేశ మందిరాన్ని ప్రారంభిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

- రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి
- కాసరబాద, ఇమాంపేటలో పల్లెదవాఖానాలు ప్రారంభం

సూర్యాపేట రూరల్: పేదలకు మెరుగైన వైద్యం అందించడమే బీఆర్‌ఎస్ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. బుధవారం రాత్రి సూర్యాపేట మండలంలోని కాసరబాద, ఇమాంపేట గ్రామాల్లో పల్లె దవాఖానాలు, పశు వైద్యశాలలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ కార్పొరేట్ వైద్యం అందించాలన్న సంకల్పంతోనే సీఎం కేసీఆర్ వైద్యరంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. ఇందులో భాగంగానే పల్లె దవాఖానులు, మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేస్తున్నారని పేర్కొన్నారు. తెలంగాణలో జిల్లాకో మెడికల్ కళాశాల ఏర్పాటు చేయడం ఇందుకు నిదర్శనమన్నారు. ప్రజా సంక్షేమ పథకాల అమలులో దేశంలోనే తెలంగాణ నంబర్ వన్ స్థానంలో ఉందన్నారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌కు వచ్చే ఎన్నికల్లో ప్రజలు అండగా నిలబడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి హర్షవర్ధన్, సూర్యాపేట ఎంపీపీ బీరవోలు రవీందర్‌రెడ్డి, జెడ్పీటీసీ జీడి భిక్షం, సర్పంచ్‌లు రేణుక, పాముల ఉపేందర్, ఎంపీటీసీలు బంటు నాగమ్మ, మామిడి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులను మోసం చేసిన కేసీఆర్



ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి కేసీఆర్ 13వేల ఉపాధ్యాయ పోస్టులకు నోటిఫికేషన్ ఇస్తానని ప్రకటించి, నేడు 5వేల ఉద్యోగాలకే నోటిఫికేషన్ ఇవ్వడం నిరుద్యోగులను మోసం చేయడమేనని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పోలెబోయిన కిరణ్ కుమార్ అన్నారు. 20 వేల ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం సూర్యాపేటలోని జిల్లా కోర్టు వద్ద ఆందోళన చేపట్టారు. నిరుద్యోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసి మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ తొమ్మిదేళ్ల పాలనలో విద్యార్థులు, నిరుద్యోగులు అడుగడుగునా దగా, మోసానికి గురయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు పుల్లూరి సింహాద్రి, పిడమర్తి భరత్, రహీం, వేణు, ప్రశాంత్, సాయి, సన్నీ, చందు, గోపీచంద్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

ఐదు మున్సిపాలిటీలకు రూ.150 కోట్లు

సూర్యాపేట: జిల్లాలోని ఐదు మున్సిపాలిటీలకు రూ.150 కోట్ల నిధులు విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల సూర్యాపేటలో జరిగిన ప్రగతి నివేదన సభలో సీఎం కేసీఆర్‌ను రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి సూర్యాపేట మున్సిపాలిటీతో పాటు అన్ని మున్సిపాలిటీల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. ఆ సభలో సీఎం కేసీఆర్ వెంటనే జగదీశ్‌రెడ్డి కోరిక మేరకు వెంటనే స్పందించారు. సూర్యాపేట మున్సిపాలిటీకి రూ.50కోట్లు, కోదాడ, తిరుమలగిరి, నేరేడుచర్ల, హుజూర్‌నగర్‌లకు రూ.25 కోట్ల చొప్పున నిధులు విడుదల చేశారు. ఈ నిధులతో ఆయా పనులు చేపట్టనున్నారు.

అందుబాటులోకి జీపీఎఫ్ సేవలు



జెడ్పీ కార్యాలయంలో జీపీఎఫ్ విభాగాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపిక

సూర్యాపేట టౌన్: ఇప్పటి నుంచి సూర్యాపేట జెడ్పీ కార్యాలయం నుంచే ఉపాధ్యాయ, ఉద్యోగులకు జీపీఎఫ్ సేవలు అందుతాయని జెడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపిక అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా పరిషత్ కార్యాలయంలో జీపీఎఫ్ విభాగాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఉమ్మడి జిల్లా పరిషత్ నుంచి విభజన అనంతరం నల్లగొండ జెడ్పీ కార్యాలయం నుంచి సూర్యాపేటకు జీపీఎఫ్ విభాగం పూర్తి స్థాయి రికార్డుల బదిలీ ప్రక్రియ జరిగిందన్నారు. జిల్లాలో జెడ్పీ యాజమాన్య పరిధిలో పనిచేస్తున్న జీపీఎఫ్ ఖాతాలు కలిగి ఉన్న 2,399 మంది ఉద్యోగ, ఉపాధ్యాయుల సౌలభ్యంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ సురేష్, శ్రవణ్‌కుమార్, వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ ఎదుట దీక్ష చేస్తున్న 104 ఉద్యోగులు

సూర్యాపేట: 104లో పనిచేస్తున్న తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎఫ్‌డీహెచ్‌ఎస్ కాంట్రాక్ట్ ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ మేరకు తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం సూర్యాపేట కలెక్టరేట్ ఎదుట 104 ఉద్యోగులు దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు మాట్లాడుతూ 2008లో డీఎస్సీ ద్వారా రోస్టర్ పద్ధతిలో ప్రభుత్వ ఆధీనంలోనే 1,350 ఉద్యోగాలు ఇచ్చారని పేర్కొన్నారు. అప్పటి నుంచి ఎలాంటి ఉద్యోగ భద్రత లేకుండా చాలీచాలనీ వేతనాలతో పనిచేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. 104 ఎఫ్‌డీహెచ్‌ఎస్ ఉద్యోగులకు వేతనాల చెల్లింపులో ఏజెన్సీ విధానాన్ని రద్దుచేసి ట్రెజరీ ద్వారా ఇవ్వాలన్నారు. సమానపనికి సమాన వేతనం చెల్లించి క్రమబద్ధీకరించాలని కోరారు. కార్యక్రమంలో జి.రాజు, రవి, శివకుమార్, ఉపేందర్, నాగరాజు, సైదులు, మాణిక్యం, ఉమారాణి, సైదమ్మ, శ్రావణి, బ్రహ్మం, నాగమణి, నరసింహారావు, వెంకన్న, వీరబ్రహ్మం, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చట్టసభల్లో వాటా సాధించేవరకు పోరు



సభలో అభివాదం చేస్తున్న గౌడ జనహక్కుల పోరాట సమితి నాయకులు

- జీజేహెచ్‌పీఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు విజయ్‌కుమార్‌గౌడ్

భానుపురి (సూర్యాపేట): గౌడ జనాభా ప్రాతిపదికన చట్టసభల్లో ప్రాతినిధ్యం సాధించేవరకు పోరాటం చేస్తామని గౌడ జన హక్కుల పోరాట సమితి (జీజేహెచ్‌పీఎస్) రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు ఎలికట్టె విజయ్‌కుమార్‌గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం సూర్యాపేట పట్టణంలోని పబ్లిక్ క్లబ్ ఆడిటోరియంలో నిర్వహించిన గౌడల ఆత్మీయ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా గీత కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, అన్ని పార్టీల్లోనూ కార్యకర్తలుగా ముందు వరుసలో ఉంటున్నప్పటికీ రాజ్యాధికార పదవులకు దూరవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సభ్యత్వం కలిగిన ప్రతి గీత కార్మికుడికి టూ వీలర్ మోపెడ్ ఇవ్వాలన్నారు. తాటి, ఈత వనాలు పెంచేందుకు ప్రతి గౌడ సొసైటీకి ఐదు ఎకరాల భూమి కేటాయించాలన్నారు. షరతులు లేకుండా 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ సభ్యతం ఇచ్చి గౌడబంధును అమలు చేయాలని కోరారు. గీత కార్మికుల పెన్షన్‌ను రూ.5వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. జెడ్పీ వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణగౌడ్ మాట్లాడుతూ గీత కార్మికుల భవనానికి గతంలో ఇచ్చిన హామీ ప్రకారం రెండెకరాల భూమి, రూ.2కోట్లు ఇచ్చేందుకు త్వరలో విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగాని బాలరాజు గౌడ్, తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ కన్వీనర్ అయిలి వెంకన్న గౌడ్, జిల్లా అధ్యక్షుడు కారింగుల శ్రీనివాస్ గౌడ్, తుంగతుర్తి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పులుసు యాదగిరిగౌడ్, నూతనకల్ పీఏసీఎస్ చైర్మన్ కనకటి వెంకన్నగౌడ్, గౌడ జన హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు బిక్కి బుచ్చయ్య గౌడ్, చిత్తలూరు నారాయణగౌడ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చొగోని శ్రీనివాస్‌గౌడ్, జిల్లా కార్యదర్శులు రేస్ రాములుగౌడ్, తాళ్లపల్లి యాదగిరి గౌడ్, కప్పల రామ్మూర్తి గౌడ్, తాడూరి సైదులుగౌడ్, జలగం మల్లేష్‌గౌడ్, కనకమల్లు గౌడ్, శిగ జానయ్య గౌడ్, దంతులూరి సోమన్న, చెనగాని అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ జీవిత చరిత్రపై నేటి నుంచి నాటక ప్రదర్శన

దురాజ్‌పల్లి (సూర్యాపేట): జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ జీవిత చరిత్ర, లక్ష్యాలపై అభ్యుదయ ఆర్ట్ అకాడమీ హైదరాబాద్ వారిచే గురువారం నుంచి సంఘం శరణం గచ్చామి అనే నాటక ప్రదర్శన నిర్వహించనున్నట్టు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి దయానందరాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంట్లో భాగంగా గురువారం సాయంత్రం 6గంటలకు కోదాడలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో, 6వ తేదీన సాయంత్రం 6 గంటలకు తుంగతుర్తిలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో, హుజూర్‌నగర్‌లోని టౌన్ హాల్‌లో, ఈనెల 8న సూర్యాపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణల్లో నిర్వహించబోయే ప్రదర్శనలను స్థానిక ఎమ్మెల్యేలు ప్రారంభిస్తారని పేర్కొన్నారు. విద్యార్థులు, అన్నివర్గాల ప్రజలు, ప్రజాప్రతినిధులు, దళిత సంఘాల నాయకులు తరలి వచ్చి ఈ నాటక ప్రదర్శనలను వీక్షించాలని కోరారు.

రాష్ట్ర స్థాయిలోనూ రాణించాలి

దురాజ్‌పల్లి (సూర్యాపేట): జిల్లాలో నిర్వహించిన ప్రత్యేక స్వీప్ కార్యక్రమంలో గెలుపొందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయిలోనూ రాణించాలని అదనపు కలెక్టర్ సీహెచ్.ప్రియాంక అన్నారు. బుధవారం ప్రత్యేక బస్‌లో హైదరాబాద్ వెళ్తున్న విద్యార్థుల వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో స్వీప్ కార్యక్రమంలో భాగంగా ఓటు ఆవశ్యకతపై నిర్వహించిన పాటలు, పద్యాలు, నాటక పోటీల్లో ఉత్తమ ప్రదర్శన కనబర్చిన వారిని ఎంపిక చేసి రాష్ట్ర స్థాయి పోటీలకు పంపుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వీప్ నోడల్ అధికారి డీఈఓ అశోక్, డీఆర్‌డీఓ కిరణ్ కుమార్, డీపీఆర్‌ఓ రమేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు కిట్లు పంపిణీ

సూర్యాపేట: క్రీడాకారుల్లోని నైపుణ్యం పెంపొందించుటకు తెలంగాణ ప్రభుత్వం క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసిందని జిల్లా అదనపు కలెక్టర్ ప్రియాంక అన్నారు. బుధవారం సూర్యాపేట పట్టణంలోని 9, 12, 29 వార్డుల్లో క్రీడాకారులకు కిట్లు పంపిణీ చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, మున్సిపల్ కమిషనర్ రామానుజులరెడ్డి, కౌన్సిలర్లు బచ్చలకూరి శ్రీనివాస్, అనంతుల యాదగిరి, చింతలపాటి భరత్ మహాజన్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



జెండా ఊపి వాహనాన్ని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ ప్రియాంక

క్లుప్తంగా

వృద్ధురాలి బలవన్మరణం

గుర్రంపోడు : పురుగుల మందు తాగి ఓ వృద్ధురాలు ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మండలంలోని నడికూడ గ్రామంలో బుధవారం వెలుగుచూసింది. గ్రామానికి చెందిన కట్టెబోయిన సైదమ్మ (65) మంగళవారం రాత్రి పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు నల్లగొండ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో చనిపోయినట్లు గ్రామస్తులు తెలిపారు. ఆరోగ్య సమస్యలతోపాటు గత కొంతకాలంగా కడుపు నొప్పి భరించలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు వారు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలు మృతి

రామన్నపేట : అనుమానాస్పద స్థితిలో ఓ వృద్ధురాలు మృతిచెందింది. ఈ ఘటన మండలంలోని వెల్లంకి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన బండ్ల మంగమ్మ(70)కు ముగ్గురు కుమారులు, కుమార్తె కలరు. మంగళవారం రాత్రి 10గంటల సమయంలో మంగమ్మ ఇంటి ముందున్న నీటిసంపులో పడింది. కుటుంబసభ్యులు, ఇరుగు పొరుగువారు గమనించి సంపులో నుంచి బయటకు తీసి చూడగా అప్పటికే మృతి చెందింది. కుటుంబ సభ్యులు బుధవారం అంత్యక్రియలకు ఏర్పాటు చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రామన్నపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి రెండవ కుమారుడు పాండు ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ ఎం.లక్ష్మయ్య తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

చిలుకూరు: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన చిలుకూరు హరిజనవాడ సమీపంలో బుధవారం జరిగింది. చిలుకూరు గ్రామానికి చెందిన సావిత్రమ్మను రోడ్డు దాటుతుండగా కోదాడ నుంచి హుజూర్‌నగర్ వైపు వస్తున్న స్కూటర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సావిత్రమ్మతో పాటు స్కూటర్ నడుపుతున్న వ్యక్తి కూడా గాయాలయ్యాయి. స్థానికులు ఇద్దరిని వైద్యశాలకు తరలించగా సావిత్రమ్మ పరిస్థితి విషమంగా ఉండడంతో ఖమ్మం వైద్యశాలకు తీసుకెళ్లారు.

మోదీ అనుమతి అవసరం లేదు

- శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

మిర్యాలగూడ : మంత్రి కేటీఆర్‌ను ముఖ్యమంత్రిని చేయడానికి ప్రధాని నరేంద్ర మోదీ అనుమతి అవసరం లేదని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నిజామాబాద్‌లో నిర్వహించిన సభలో ప్రధానమంత్రి మోదీ తెలంగాణపై విషం కక్కారని ధ్వజమెత్తారు. వెంటిలేటర్‌పై ఉన్న బీజేపీని కాపాడుకోవడానికే ప్రధాని సీఎం కేసీఆర్‌పై అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. సీబీఐ, ఈడీని బీజేపీ తమ జేబు సంస్థలుగా వాడుకుంటూ ప్రతిపక్ష నాయకులపై ఉసిగొల్పుతోందని ఆరోపించారు. ఈ దేశంలో బీజేపీ చేసిన అన్యాయాలు, అక్రమాలు ఎన్నో ఉన్నాయన్నారు. వారసత్వ రాజకీయాలకు బీజేపీ పెట్టింది పేరని బీజేపీలో మంత్రుల కుటుంబాలకు చెందిన వారు అనేక మంది ప్రస్తుతం పదవుల్లో ఉన్నారని పేర్కొన్నారు. మంత్రి కేటీఆర్ విజన్ ఉన్న నాయకుడని భవిష్యత్‌లో తప్పకుండా ముఖ్యమంత్రి అవుతారని, అందుకు మోదీ సహకారం అవసరం లేదన్నారు. తెలంగాణ ఏర్పాటు ఉద్యమంలో రక్తం ఏరులైపారిందంటున్న మోదీ ఎక్కడ హింస జరిగిందో చెప్పాలన్నారు. తన పక్కన అవినీతిపరులకు చోటు లేదన్న మోదీ మీ పార్టీలోని కొందరు ముఖ్యమంత్రులు ఈడీ, సీబీఐ కేసుల్లో ఇరుక్కున్నారని గుర్తు చేశారు.

సఖ్యతకు అడ్డొస్తున్నాడనే..

- ప్రియుడు, మరొకరితో కలిసి భర్తను హత్య చేయించిన భార్య
- నిద్రిస్తున్న వ్యక్తి గొంతు నులిమి ఘాతుకం
- ముగ్గురు నిందితుల అరెస్ట్, రిమాండ్



హతుడు చాంప్లతో భార్య అరుణ ముగ్గురు పిల్లలు(ఫైల్)

అర్వపల్లి: సఖ్యతకు అడ్డొస్తున్నాడన్న కారణంతోనే ప్రియుడు మరొకరితో కలిసి భర్తను భార్య హత్య చేయించినట్లు పోలీసుల విచారణలో తేలింది. సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం మండలం నాణ్యతండా ఆవాసం పూర్యాతండా సమీపంలో గత నెల 24న చోటు చేసుకున్న హత్య కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. నాగారం సీఐ కె.శివశంకర్, అర్వపల్లి ఎస్‌ఐ అంజిరెడ్డి బుధవారం తెలిపిన కేసు వివరాలు ఇలా ఉన్నాయి. నూతనకల్ మండలం బక్కహేమ్లాతండాకు చెందిన గుగులోతు చాంప్ల జాజిరెడ్డిగూడెం మండలం నాణ్యతండా ఆవాసం పూర్యాతండా సమీపంలోని గుట్టల పక్కన కొంత కాలంగా తన వ్యవసాయ భూమిలో బొగ్గు బట్టీలు నడుపుతున్నాడు. గత నెల 24న రాత్రి చాంప్ల తన భార్య అరుణ, కుమారుడు ధనుష్ ముగ్గురు కలిసి బైక్‌పై తమ తండా నుంచి బొగ్గు బట్టీల వద్ద గుడిసెలో పడుకున్నారు. ఒక మంచంలో చాంప్ల, మరో మంచంలో ఆయన భార్య, కుమారుడు నిద్రిస్తున్నారు. అర్ధరాత్రి దాటాక చాంప్ల భార్య అరుణ, ఆమె ప్రియుడైన అదే తండాకు చెందిన గుగులోతు వీరన్న, మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం చిల్లంచర్ల గ్రామానికి చెందిన పిప్పాల రాంమ్మూర్తి ముగ్గురు కలిసి చాంప్లను గొంతునులిమి కొట్టి హత్య చేశారు. ఈ సమయంలో మంచంలో నిద్రిస్తున్న చాంప్ల కుమారుడు ధనుష్ తండ్రి హత్యను చూసి తాతకు ఫోన్‌చేయడానికి ప్రయత్నించగా అరుణ కుమారున్ని పడుకోమని చద్దరు కప్పి పడుకోబెట్టింది. అయితే మరుసటి రోజు ఉదయం అరుణ ఏమి తెలియనట్లుగానే భర్త శవంపై పడి ఏడుస్తుండగా చుట్టు పక్కల వారు చూసి తండా వాసులకు సమాచారం అందించారు.

ఆరు నెలలకు ముందే హత్యకు పథకం

చాంప్ల, అరుణలు ఇద్దరు క్లాస్‌మేట్లు. ఇద్దరు చదువుకున్న రోజుల నుంచే ప్రేమించుకున్నారు. పెద్దలను ఒప్పించి 12ఏళ్ల కిందట పెళ్లి చేసుకున్నారు. ఇద్దరు కుమార్తెలు, కుమారుడు జన్మించారు. అరుణ పెళ్లికి ముందు నుంచే అదే తండాకు చెందిన నిందితుడు గుగులోతు వీరన్నతో వివాహేతర సంబంధాన్ని కొనసాగిస్తోంది. పెళ్లి అయ్యాక కూడా అరుణలో మార్పు రాక పోవడంతో భార్య భర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. పెద్ద మనుషుల వద్ద పంచాయితీ కూడా పెట్టారు. అయినా అరుణ తన తీరును మార్చుకోలేదు. అయితే తన వివాహేతర సంబంధానికి భర్త అడ్డువస్తున్నాడని, మద్యం సేవించి తనను ఇబ్బందులకు గురిచేస్తున్నాడని అరుణ తన ప్రియుడు వీరన్నకు చెప్పడంతో 6 నెలల కిందట నుంచే చాంప్లను హత్య చేయాలని పథకం వేశారు. అప్పటి నుంచి ప్రయత్నిస్తూ చివరకు గత నెల 23న అరుణ వీరన్నకు ఫోన్‌చేసి ఎప్పుడు వస్తున్నావు చాంప్లను చంపడానికి అని అడగ్గా.. నా సేహితుడు రాంమ్మూర్తిని వెంటతీసుకొని వస్తానని అతనికి రూ.4 లక్షలు ఇస్తానని మాట్లాడినట్లు ఫోన్‌లో అరుణకు వీరన్న తెలియజేశాడు. అదే ప్రకారం మరుసటి రోజు రాత్రి వీరన్న రాంమ్మూర్తి భార్య కళ్లెదుటే నిద్రలో ఉన్న చాంప్ల మీద రాంమ్మూర్తి కూర్చొని చేతులు పట్టుకోగా, వీరన్న చాంప్ల గొంతు పట్టుకొని గట్టిగా ముక్కు నోరు మూసి ఊపిరాడకుండా చేసి హత్య చేశారు. అయితే సంఘటనా స్థలిలో అరుణ ధరించిన పగిలిన గాజుముక్కలను ఆరోజే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే నిందితులకు చెందిన రెండు జతల చెప్పులు, ద్విచక్రవాహనం, 3సెల్‌ఫోన్లు పట్టుకుని సీజ్‌చేశారు. చాంప్ల భార్య అరుణ, ప్రియుడు వీరన్న, ఆయన స్నేహితుడు రాంమ్మూర్తి ముగ్గురిని బుధవారం తండాలోనే అరెస్ట్ చేసి కోర్టుకు రిమాండ్‌కు పంపారు. కాగా ఈ కేసు పరిశోధనలో కానిస్టేబుల్ ఉమామహేష్, హోంగార్డు సీహెచ్. అశోక్‌లు తమకు సహకరించారని సీఐ, ఎస్సైలు తెలిపారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్య



రవినాయక్ (ఫైల్)

తుర్కపల్లి: పురుగుల మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన తుర్కపల్లి మండలం దయ్యంబండ తండాలో బుధవారం చోటు చేసుకుంది. తండాకు చెందిన వాంకుడోత్ రవినాయక్ (28) గ్రామంలో బియ్యం వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషించుకునే వాడు. ఏడాది క్రితం ఇంట్లో భార్య బండలు కడిగుతోంది. ఈ క్రమంలో రవినాయక్ బయట ఉన్న బియ్యం బస్తాలను ఇంట్లోకి మోసుకోస్తున్న క్రమంలో కాలు జారి బండలమీద పడిపోయాడు. దీంతో అతడి వెన్నపూసకు బలంగా గాయం కావడంతో హైదరాబాద్‌కు తరలించి వైద్యం చేయించారు. అప్పటి నుంచి రవినాయక్ రెండు కాళ్లకు స్పర్శలేక పనిచేయలేదు. నాటి నుంచి ఇంటిపట్టునే ఉంటున్నాడు. భార్య ప్రమీల భర్తకు సపర్యలు చేస్తూ, ఇంటి దగ్గర కిరాణ దుకాణం నడుపుతోంది. కొద్దిరోజుల క్రితం రవినాయక్ మూడు చక్రాల వాహనాన్ని కొనుగోలు చేసుకున్నాడు. ఈ తరుణంలో మంగళవారం రవినాయక్ సాయంత్రం స్కూటీ పైన మండల కేంద్రానికి వెళ్లా. రాత్రి వరకు ఇంటికి రాకపోవడంతో భార్య ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. దీనితో బంధువులకు, తండా వాసులను రవినాయక్ కోసం ఆరా తీసిన ఆచూకీ తెలియరాలేదు. దీంతో రవినాయక్ భార్య భర్త కనబడడం లేదని మంగళవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేసింది. బుధవారం ఉదయం ఫోన్ లొకేషన్ ఆధారంగా రవినాయక్ వీరారెడ్డిపల్లి గ్రామ శివారులో ఉన్నడని గుర్తించారు. వెంటనే తండ వాసులు, బంధువులు వెళ్లి చూడగా అపస్మారకస్థితిలో పడి ఉన్నాడు.అతడిని భువనగిరి ఆస్పత్రికి, అక్కడి నుంచి సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. మృతుడికి ఇద్దరు కొడుకులు, కూతురు ఉన్నారు. ఫోన్‌లో చూడగా మంగళవారం సాయంత్రమే పురుగుల మందు తాగుతున్నప్పుడు తీసుకున్న వీడియో ఉంది. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

ఆకుపాముల వాసికి జాతీయ అవార్డు



అవార్డు అందుకుంటున్న సుధాకర్ గౌడ్

మునగాల(కోదాడ): మండలంలోని ఆకుపాముల గ్రామానికి చెందిన బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, సామాజిక ఉద్యమకారుడు పోలంపల్లి సుధాకర్‌గౌడ్ ఏపీజే అబ్దుల్ కలాం నేషనల్ ఆవార్డు అందుకున్నారు. ఈ మేరకు మంగళవారం రాత్రి హైదరాబాద్‌లోని బోగులకుంటలోని తెలంగాణ సరస్వతీ పరిషత్ వేదికలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో ఇండియా ఎన్జీవో ఫౌండర్, చైర్మన్ డా. ఆకుల రమేష్ , స్ఫూర్తి సర్వీసెస్ సొసైటీ ట్రెజరర్ మంజుల చేతుల మీదుగా సుధాకర్ గౌడ్ ఆవార్డు, ప్రశంసాపత్రం అందుకున్నారు. కార్యక్రమంలో స్ఫూర్తి సర్వీసెస్ ట్రెజరర్ మంజుల ,లయిన్ డా.గడ్డుపల్లి శ్రీనివాసరావు, లయన్, డా.యాదయ్య గౌడ్, డా.సీతరాజ్ కుమార్, విమరశెట్టి రవీందర్ పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ వేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పెద్దింటి రామకృష్ణ

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం 5,089 పోస్టులతో వేసిన మినీ డీఎస్సీ నోటిఫికేషన్ రద్దుచేసి, గత అసెంబ్లీ సమావేశాల్లో ప్రకటించిన 13,089 పోస్టులతో మెగా డీఎస్సీ వేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెద్దింటి రామకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో 5 సంవత్సరాల తర్వాత 6 లక్షల మంది అభ్యర్థులకు 5వేల పోస్టులతో డీఎస్సీ నోటిఫికేషన్ వేయడం దారుణమన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థుల, నిరుద్యోగుల ఆశలన్ని అడియాశలే అయ్యాయన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్ర అఖిల్ కుమార్, సందీప్, శ్రీకాంత్, జస్వంత్, అరవింద్, మహేందర్, మధు కిరణ్ పాల్గొన్నారు.

బైక్, ఆటో ఢీ.. యువకుడి దుర్మరణం



మల్లేష్ (ఫైల్)

గుండాల : బైక్ అదుపు తప్పి ఆటోను వెనుక నుంచి ఢీ కొట్టడంతో ఓ యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన గుండాల మండలంలోని అనంతారం గ్రామంలో బుధవారం జరిగింది. అనంతారం గ్రామానికి చెందిన బొంగు మల్లేష్ (25), పాచిల్ల గ్రామానికి చెందిన పందుల రామకృష్ణ స్వగ్రామం నుంచి బైక్‌పై గుండాలకు వస్తున్న క్రమంలో ముందుగా వెళుతున్న గ్యాస్ ఆటోను వెనుక నుంచి ఢీ కొట్టడంతో కింద పడిపోయారు. ప్రమాదంలో బొంగు మల్లేష్‌కు తీవ్ర, పందుల రామకృష్ణకు స్వల్ప గాయాలయ్యాయి. బాటసారులు ఇచ్చిన సమాచారం మేరకు కుటుంబ సభ్యులు 108 వాహనంతో ఆలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే బొంగు మల్లేష్ మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

వరి పంటను కాపాడుకోవడానికి..

- జనరేటర్‌తో నీరు పెడుతున్న రైతు



రామలక్ష్మీపురంలో జనరేటర్‌తో బోరును నడిపిస్తున్న రైతు

కోదాడరూరల్ : కోదాడ మండల పరిధిలోని రామలక్ష్మీపురం గ్రామానికి కొప్పుల సాగర్‌రెడి చేతికొచ్చిన వరిపంటను ఎండిపోకుండా కాపాడుకునేందుకు భగీరథ ప్రయత్నం చేస్తున్నాడు. రైతు తన బావికింద ఐదు ఎకరాలు, బోరు సాయంతో మరో నాలుగు ఎకరాలు వరి సాగు చేశాడు. బోరు కింద సాగు చేసిన వరికి విద్యుత్ అంతరాయంతో నీరు సరిపోవడం లేదు. లక్షల రూపాయల పెట్టుబడి పెట్టి సాగు చేసిన వరి ప్రస్తుతం పొట్ట దశలో ఉంది. మరో మూడునాలుగు తడులు(నీరు) ఇస్తే పంట ఇంటికి చేరుతుందనే నమ్మకంతో బంధువుల జనరేటర్‌ను తీసుకొచ్చి ట్రాక్టర్ సహాయంతో బోరుకు అమర్చి నడిపిస్తున్నాడు. ఎకరం వరి పొలం పారేందుకు మూడునాలుగు గంటలు పడుతుందని, గంటకు మూడు లీటర్ల డీజిల్ అవసరం అవుతుందని రైతు తెలిపాడు. రైతులకు ఈ బాధలు తప్పాలంటే అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి సాగర్ నీటిని ఒక్కసారి విడుదల చేయిస్తే సాగు చేసిన పంటలు చేతికొస్తాయని సాగర్‌రెడ్డి చెబుతున్నాడు.

ప్రీ రిపబ్లిక్ పరేడ్‌కు వలంటీర్ల ఎంపిక



ఎంపికైన వలంటీర్లు

ఎంజీయూ(నల్లగొండ రూరల్) : వెస్ట్ జోన్ ప్రీ రిపబ్లిక్ పరేడ్‌కు ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లను బుధవారం మహాత్మాగాంధీ యూనివర్సిటీలో ఎంపిక చేసినట్లు ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ మద్దిలేటి తెలిపారు. వలంటీర్ల నైపుణ్యాలను పెంచే దిశగా కేంద్ర క్రీడల, యువజన సర్వీస్‌ల శాఖ ప్రోత్సహి స్తున్నట్లు వివరించారు. వివిధ అంశాల్లో ప్రావీణ్యం ఉన్న వారిని ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎన్‌ఎస్‌ఎస్ డిప్యూటీ ఆఫీసర్ గీత, యూత్ ఆఫీసర్ సైదా నాయక్, పీఓలు మాధవి, మీనమ్మ, భావన, మురళి ,శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

వ్యవసాయ విద్యార్థులకు క్షేత్రస్థాయిలో అవగాహన

గరిడేపల్లి : వ్యవసాయ డిగ్రీ విద్యార్థులకు విస్తరణ కార్యక్రమాలపై సరైనా అవగాహన ఉన్నప్పుడే క్షేత్రస్థాయిలో అనుభవం పొందగలుగుతారని కేవీకే శాస్త్రవేత్త, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ బి. లవకుమార్ అన్నారు. బుధవారం గరిడేపల్లి మండలం గడ్డిపల్లి కేవీకేలో విద్యార్థులకు వ్యవసాయ విస్తరణ నిర్వహణపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇటీఎం మండసూర్ తదితరులు పాల్గొన్నారు.

అధికారంలోకి రాగానే స్కీములు అమలు

- ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



మత పెద్దలతో కలిసి ప్రార్థనలు చేస్తున్న ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

చిలుకూరు: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయం అని , అధికారంలోకి వచ్చిన వెంటనే పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ స్కీములను అమలు చేస్తామని నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. బుధవారం సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలంలోని రామాపురం గ్రామంలో గడపగడపకు కాంగ్రెస్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో దేశంలోనూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని, రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి కావడం ఖాయం అని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో డిసెంబర్‌లో ఎన్నికలు జరుగుతాయని ఆ ఎన్నికల్లో అవినీతి బీఆర్‌ఎస్ పార్టీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పాడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ 70 సీట్లుకు పైగా గెలవడం పక్కా అని అన్నారు. రాష్ట్రంలో ఎమ్మెల్యేలు అవినీతిమయంలో కూరుకుపోయారని ఆరోపించారు. ఎక్కడ చూసినా ఎమ్మెల్యే ల్యాండ్, శ్యాండ్, మైన్, వైన్స్ దందాలో ఉన్నారని విమర్శించారు. దళితబంధులో లబ్ధిదారులకు కంటే ఎక్కువ మొత్తంలో కమీషన్లు 70 శాతం మధ్యవర్తులకే పోతున్నాయని ఆరోపించారు.

కాంగ్రెస్ పార్టీ ముస్లింలకు అండగా ఉంటుంది

హుజూర్‌నగర్ : కాంగ్రెస్ పార్టీ ముస్లింలకు ఎల్లప్పుడు అండగా ఉంటుందని టీపీసీసీ మాజీ అధక్షుడు, నల్లగొండ ఎంపీ ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. హుజూర్‌నగర్‌లోని ఉస్మానియా మజీద్‌ను బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ముస్లిం మైనార్టీలకు తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని చెప్పారు. వక్ఫ్ బోర్డు ఆస్తులు, ముస్లీంల దర్గాలు, ఈద్గాలు, పీర్ల చావిడి స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయని తన దృష్టికి వచ్చిందన్నారు. వక్ఫ్ బోర్డు ఆస్తులను ఏ స్థాయి నాయకుడు ఆక్రమించినా సహించేది లేదన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నంత కాలం ముస్లింలకు నూరు శాతం సహాయ సహకారాలు అందించానని చెప్పారు. నియోజకవర్గంలో కబరస్తాన్‌లకు, పీర్ల కొట్టాలకు, షాదీ ఖానాలకు ఎన్నో నిధులు కేటాయించినట్లు గుర్తు చేశారు. కార్యక్రమంలో ముస్లీం మత పెద్దలు పాల్గొన్నారు.

వైభవంగా నృసింహుడి నిత్య కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి ఆలయంలో రాజ్యలక్ష్మి, చెంచులక్ష్మి సమేత లక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని బుధవారం అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, నిత్యాగ్నిహోత్రి, స్వామివారికి పంచామృతాలతో అభిషేకం, అష్టోత్తర సహస్రనామార్చన తదితర పూజలు చేశారు. అనంతరం ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదాన్ని రక్తికట్టించారు. కల్యాణ వేడుకలో భాగంగా విశ్వక్సేనారాధన, పుణ్యాహవచణం, రుత్విగ్వరణం, రక్షాబంధనం, మధుపర్కపూజ, మాంగళ్యధారణ గావించారు. అనంతరం భక్తులను తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చెన్నూరు విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు పాల్గొన్నారు.

బ్యాంక్ ఆఫీసర్ పరీక్షకు ఉచిత శిక్షణ


నల్లగొండ : తెలంగాణ రాష్ట్ర మైనారిటీ స్టడీ సర్కిల్, మైనార్టీ సంక్షేమ శాఖ హైదరాబాద్ ఆధ్వర్యంలో బ్యాంక్ ప్రొబెషనరీ ఆఫీసర్ పరీక్ష కోసం వంద మంది మైనారిటీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి టి.విజేందర్‌రెడ్డి తెలిపారు. అర్హులైన మైనారిటీ అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈ నెల 10వ తేదీలోగా కలెక్టరేట్‌లోని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ కార్యాలయంలో సమర్పించాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 94943 45471, 79811 96060 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

అంగన్‌వాడీ కేంద్రాలను పర్యవేక్షించాలి

సూర్యాపేట టౌన్: జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలను సీడీపీఓలు, సూపర్‌వైజర్లు నిరంతరం పర్యవేక్షించాలని జెడ్పీ 5వ స్థాయీ సంఘం చైర్‌పర్సన్ చింతారెడ్డి చంద్రకళ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని జెడ్పీ కార్యాలయంలో 5వ స్థాయీ సంఘం సమావేశం ఆమె అధ్యక్షత నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలు, వాటి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. సరైన పోషకాహారం అందించి పిల్లల ఆరోగ్య స్థాయిని మెరుగుపరచాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ బొలిశెట్టి శిరీష, జెడ్పీ సీఈఓ సురేష్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పత్తిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

- నడిగూడెం ఏఓ రాజగోపాలరావు



ఎం.రాజగోపాలరావు, వ్యవసాయాధికారి

నడిగూడెం : ప్రస్తుతం పత్తి చేలు పూత, పిందె దశల్లో ఉన్నాయి. ఇలాంటి సమయంలో ఎప్పటికప్పుడు సస్యరక్షణ చర్యలు పాటించాలని నడిగూడెం మండల వ్యవసాయాధికారి ఎం .రాజగోపాలరావు చెబుతున్నారు.

ఆశించే పురుగులు.. నివారణ చర్యలు

కాండం తొలుచు పురుగు : ఈ పురుగు లార్వాలు పత్తి మొక్క కాండాన్ని భూమి నుంచి అడుగున్నర దూరంలో తొలిచి కాండం మధ్య భాగాన్ని మొత్తాన్ని తినేస్తాయి. పురుగు ఆశించిన పత్తి మొక్కల దగ్గర రంపపు పొట్టు లాగా పడి ఉండడం గమనించవచ్చు. పురుగు ఆశించినపుడు కాండం బలహీనమై, కొమ్మలు విరుగుతాయి. క్రమేపి మొక్క చనిపోతుంది. పురుగు ఉనికిని గమనించిన వెంటనే లార్వాను ఏరివేసి నాశనం చేయాలి. ఈ పురుగు జూన్ నుంచి అక్టోబరు మాసంలో అధిక ఉష్ణోగ్రతలు వర్షాభావ పరిస్థితులు ఉన్నప్పుడు గమనించవచ్చు. దీని నివారణకు ఆక్సీడెమటాల్ మిథైల్ (మెటాసిస్టాక్స్) 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేసినట్లయితే పురుగు ఉధృతి కొంత వరకు తగ్గుతుంది.



సాగులో ఉన్న పత్తి

శనగపచ్చ పురుగు

తల్లిపురుగు మొక్క లేత భాగాలపై తెల్లని గుండ్రని గుడ్లను విడివిడిగా పెడుతుంది. గుడ్ల నుంచి పొదగబడిన చిన్న లార్వాలు ఆకులు, గూడ, పూత మరియు కాయలను చిన్న రంధ్రాలు చేసి నష్టపరుస్తాయి. లార్వా ముందుగా తలను పూత, కాయలలోనికి చొప్పించి మిగతా శరీర భాగాన్ని బయట ఉంచి తింటుంది. కాయకు చేసే రంధ్రం గుండ్రంగా పెద్దగా ఉంటుంది. పురుగు ఆశించిన మొగ్గలు, పూత రాలిపోతాయి. ఈ పురుగు ఆశించిన పూల విచ్చుకొని కనిపిస్తాయి. పచ్చ పురుగు గుడ్లు ఎక్కువగా ఉంటే ప్రొఫెనోఫాస్ 2 మి.లీ.లేదా థయోడికార్బ్ 1.5 గ్రా. లేదా ట్రైజోఫాస్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు లీటరు నీటికి ఇండాక్స్‌కార్బ్ 1 మి.లీ. లేదా ఇమామైక్టిన్ బెంజోయేట్ 0.5 గ్రా. లేదా ఫ్లూబెండమైడ్ 0.3.మి.లీ.లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 0.3. మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. జీవ రసాయనాలైతే 5 శాతం వేప గింజల కషాయాన్ని పిచికారీ చేయాలి. ఎకరానికి నాలుగు లింగాకర్షక బుట్టలు పెట్టి పురుగు ఉధృతిని గమనించాలి. ఎకరానికి 100 బంతి మొక్కలను ఎర పంటగా నాటాలి.

పాడి పంట

పొగాకు లద్దె పురుగు

ఈ పురుగు పైరును అన్ని దశల్లో ఆశించి బాగా నష్టపరుస్తుంది.తల్లి పురుగు ఆకుల అడుగు భాగాన ఒకే దగ్గర గుంపుగా గుడ్లను పెడుతుంది. గుడ్ల నుంచి వచ్చిన చిన్న చిన్న లార్వాలు ఆకుల అడుగున గుంపులుగా చేరి ఆకులోని పత్రహరితాన్ని గీకి తింటాయి. లార్వా దశలు పెరిగే కొద్ది విడివిడిగా ఆకులను కొరికి తిని ఈనెలను మాత్రమే మిగులుస్తాయి. వీటినే జల్లెడ ఆకులు అంటారు. ఈ లార్వాలు మొగ్గలు, పువ్వులు, కాయలను ఆశించి నష్టపరుస్తాయి. పగటి పూట ఇవి మొక్కల మొదళ్లలో భూమి లోపల ఉండి రాత్రి పూట నష్టం కలుగచేస్తాయి.

నివారణ ఇలా..

మూడవ దశ దాటిన లద్దె పురుగును అదుపు చేయడానికి విషపు ఎర వాడాలి. ఎకరానికి 10కిలోల తవుడు, 2కిలోల బెల్లంతో పాటు 1లీటరు మోనోక్రోటోఫాస్ లేదా 750 మి.లీ. క్లోరిపైరిఫాస్ లేదా 300 గ్రాములు థయోడికార్బ్ మందు సరిపడు నీటిని కలిపి మిశ్రమం పులిసిన తర్వాత చిన్న చిన్న ఉండలుగా చేసుకొని సాయంత్రం సమయంలో పొలమంతా చల్లాలి. నోవాల్యురాన్ 1 మి.లీ లేదా లుఫెన్యురాన్ 1.25 మి.లీ.లేదా థయోడికార్బ్ 1.5 గ్రా.లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. జీవ రసాయనాలు అయితే 5శాతం వేపగింజల కషాయాన్ని పిచికారీ చేయాలి. ఎకరానికి 4 లింగాకర్షక బుట్టలు పెట్టి పురుగు ఉధృతిని గమనించాలి. ఎకరానికి ఎర పంటగా 20 ఆముదం మొక్కలను వేయాలి.

ఆశించే తెగుళ్లు.. నివారణ చర్యలు

వేరుకుళ్లు తెగులు భూమిలో తేమ అధికంగా ఉన్నప్పుడు ఈ తెగులు పైరు అన్ని దశలలో కనబడుతుంది. లేత మొక్కలు అర్ధంతరంగా ఎండిపోయి చనిపోతాయి. వడలిపోయిన ఆకులు చాలా కాలం వరకు చెట్టుపై నుండి క్రిందకు వేలాడుతూ ఉంటాయి. కిలో విత్తనానికి 2 గ్రాములు కార్బెండిజిమ్ లేదా 10 గ్రాములు ట్రైకోడెర్మా విరిడితో విత్తనశుద్ధి చేసి విత్తుకోవాలి. కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు లేదా కార్బెండిజిమ్ 1 గ్రాము లీటరు నీటికి కలిపిన ద్రావణాన్ని తెగులు సోకిన మొక్కల పాదుల చుట్టూ నేలపై పోయాలి.

తలనత్త : తల్లి పురుగు గుడ్లను ఒక్కొక్కటిగా గూడమీద, కొమ్మలు మీద, లేత ఆకుల మీద పెడుతుంది. ఈ పురుగుల లార్వాలు లేత కొమ్మలను, పూమొగ్గలను, కాయలను తొలచి నష్టం కలుగచేస్తాయి. చిన్న లార్వాలు మొక్కల చివర్లను తొలిచి తినడం వలన కొమ్మల చివర్లు వడలి ఎండిపోతాయి. దీనిని తలనత్త అంటారు. దీని నివారణకు క్వినాల్‌ఫాస్ 2 మి.లీ లేదా క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. లేదా ఎసిఫేట్ 1.5 గ్రా. లేదా ట్రైజోఫాస్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. లేదా వేప గింజల కషాయం ఐదు శాతం పిచికారి చేయాలి.

ఎండు తెగులు

ఎండు తెగులు లక్షణాలు ఏ దశలోనైనా కన్పించవచ్చు. మొలక దశలో ఆశించినప్పుడు నానుడు తెగులు లక్షణాలు కన్పిస్తాయి. ఎదిగిన మొక్కలలో పుష్పించే దశలో ఈ తెగులు ఎక్కువగా కన్పిస్తుంది. తెగులు సోకిన మొక్కలు ఆకులు వాడిపోయి మొదట ఈనెల మధ్య పసుపు రంగుగా. తదుపరి ఎర్రగా మారి ఆకులు కింద నుంచి పైకి ఎండుకుంటూ రాలిపోతాయి. కొమ్మలను చీల్చి చూస్తే లోపల నల్లని బూజుతో చారలు కన్పిస్తాయి. కాపర్ ఆక్సీ క్లోరైడ్ 3 గ్రాములు లేదా కార్బెండిజిమ్ 1 గ్రాము నీటికి కలిపిన ద్రావణాన్ని తెగులు సోకిన మొక్కల పాదుల చుట్టూ నేలపై పోయాలి.